పచ్చని చెట్లపై పగ

- విద్యుత్ శాఖ నిర్వాకంతో అంతటా నిరసన
- దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యత
- పట్టించుకోని అటవీ, ఆర్అండ్‌బీ శాఖలు
- ఆందోళనలో పర్యావరణవేత్తలు



మండపేట రోడ్డులో వేస్తున్న విద్యుత్‌లైన్ కోసం ఏకపక్షంగా తొలగిస్తున్న చెట్లు

ఆలమూరు: ప్రకృతిలో పెంచిన మొక్కలు చెట్లుగా మారి ప్రజల అవసరాలను తీర్చడానికి కొన్నేళ్లు పడుతుంది. అయితే పెంచిన చెట్టును తుంచడానికి మాత్రం ఒక గంట కూడా పట్టదు. ప్రకృతిలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో ఎండ తీవ్రత పెరిగిపోవడంతో పాటు వర్షాభావ పరిస్థితులను సగటు సమాజం ఎదుర్కొంటుంది. చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలందరికీ తెలిసినా విద్యుత్‌శాఖ ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రకృతిపై తన ప్రతాపాన్ని, తెంపరితనాన్ని చూపుతుంది. 'మొక్కలు పెంచండి–పర్యావరణాన్ని పరిరక్షించండి' అంటూ ప్రకృతి ప్రేమికులు నినదిస్తుంటే విద్యుత్‌శాఖ మాత్రం పచ్చని చెట్లను నరికివేసే పనిలో నిమగ్నమైంది. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకూ ఉన్న రోడ్లకు ఇరువైపులా ఉన్న దశాబ్దాల చరిత్ర కలిగిన పురాతన చెట్లు కూడా విద్యుత్‌శాఖ నిర్వాకం వల్ల నేలకొరుగుతున్నాయి. ఇటీవల ట్రాన్స్‌కో శాఖ ప్రతి గ్రామానికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు అంటూ కొత్త విద్యుత్ లైన్లు వేస్తున్నారు. అందులో భాగంగా 39 అడుగుల పొడవైన విద్యుత్ స్తంభాలను అమర్చుతున్నారు. అయితే విద్యుత్ లైన్లు వేసే రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఆర్‌డీఎస్) సంస్థ ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకుండా అడ్డుగా ఉందని భావిస్తే వెంటనే చెట్టును నరికివేస్తున్నారు. విద్యుత్ లైన్ వేసేందుకు చెట్టు కొమ్మలు తొలగిస్తే సరిపోతుందని తెలిసినా ఆర్‌డీఎస్ మాత్రం ఏకపక్షంగా చెట్టును తొలగిస్తుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది.

అంతటా అదే పరిస్థితి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 385 గ్రామాల్లో ప్రత్యేక విద్యుత్ లైన్ల ఏర్పాటు జరుగుతుంది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నేరుగా గ్రామాలకు అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడంతో పాటు వ్యవసాయానికి సమగ్రంగా సరఫరా చేసేందుకు మరో లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అదే క్రమంలో గత మూడు నెలల నుంచి ఆర్‌డీఎస్ సంస్థ విద్యుత్ స్తంభాలు పాతి లైన్లను నిర్మిస్తున్నారు. ఆ క్రమంలో అడ్డు వచ్చిన చెట్టును నిర్దాక్షిణంగా నరికేసి కలపను మాయం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రహదారుల పక్కన ఉన్న చెట్లను తొలగించాలంటే అనేక నిబంధనలు ఉన్నా వాటిని ఏ మాత్రం లెక్కచేయకపోవడంపై ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ వేత్తలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ అడ్డగోలు చెట్ల నరికివేతపై గ్రామ పంచాయతీలు, ఆర్‌అండ్‌బీ, జిల్లా పరిషత్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

కలపను తరలించేస్తున్నారు

రహదారుల్లో కొన్ని చోట్ల పెద్ద వృక్షాలను కొట్టేటప్పుడు వచ్చే కలపను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ లైన్లకు అడ్డు వచ్చిన వృక్షాలను యథేచ్ఛగా నరికివేయడం, వచ్చిన కలపను తీసుకువెళ్లిపోవడం నిత్యకృత్యమై పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో వృక్షాలు నరికేటప్పుడు కచ్చితంగా ఆర్అండ్‌బీ, అటవీశాఖ అనుమతి ఉండాలని, అధికారులు పర్యవేక్షణలో మాత్రమే వృక్షాల తొలగింపు జరగాలని నిబంధనలు సూచిస్తున్నా పట్టించుకోకపోవడం వల్ల పచ్చని చెట్లు ఇటుక బట్టీల్లో కట్టెలుగా మారుతున్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రకృతిని పర్యావరణాన్ని పరిరక్షించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

కొమ్మల తొలగింపునకు అనుమతించాం

విద్యుత్ లైన్ల ఏర్పాటులో విద్యుత్‌శాఖ విజ్ఞప్తి మేరకు వృక్షానికి ఏ విధమైన హాని లేకుండా కేవలం కొమ్మలు, రెమ్మలు తొలగించుకోవాలని సూచించాం. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా వృక్షాలు నరికితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం

– సూర్యనారాయణ, ఆర్అండ్‌బీ డీఈ, కొత్తపేట.

క్లుప్తంగా

కరాటే, కుంగ్‌ఫూలో చిన్నారుల ప్రతిభ



కరాటే, కుంగ్‌ఫూ బెల్టులు అందుకున్న విద్యార్థులు

మామిడికుదురు: హైదరాబాద్‌కు చెందిన టైగర్స్ కుంగ్ ఫూ, కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే, కుంగ్ ఫూ నేర్చుకుంటున్న 10 మంది చిన్నారులు సోమవారం వివిధ రకాల బెల్టులు అందుకున్నారు. నగరం గ్రామంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు భూపతి సత్యనారాయణ స్వగృహం వద్ద పోటీలు నిర్వహించి చిన్నారుల ప్రతిభ ఆధారంగా బెల్టులు అందజేశారు. మామిడికుదురు మండల స్టూడెంట్స్ బెల్ట్ అప్‌డేషన్‌లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రతినిధులు కె.శివకోటి, గ్రాండ్ మాస్టర్ కె.సాయివంశీ, కోచ్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు రకాల బెల్టులను చిన్నారులకు అందజేశారు. చిన్నారుల ప్రతిభను వారు మెచ్చుకున్నారు.

వైభవంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

అయినవిల్లి: మండలలోని వీరవల్లిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో మిండగుదిటి వంశీకుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి వైభవంగా కల్యాణ మహోత్సవం జరిపారు. దాతల సహకారంతో ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం గ్రామోత్సవం జరిపారు. అలాగే బాల దుర్గమ్మవారి ఆలయంలో చండీహోమం జరిపారు.

ఆకట్టుకున్న నూకాంబిక కొత్తపూల ఉత్సవాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలకు విశేష ఆదరణ లభిస్తుంది. దేవదాయశాఖ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి ఆరో విడత కొత్తపూలు ఉత్సవం జరిగింది. మన్యసీమ నుంచి తీసుకువచ్చిన మోదుగుపూలతో అలంకరించిన పెద్దగరగకు భక్తులు దర్శించుకుని అగర బత్తీలను వెలిగించి పూలమాలలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పరిసర గ్రామాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కొత్తపూల ఉత్సవాలను తిలకించారు. కొత్తపూలు ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన తీన్‌మార్, శక్తి వేషాలు, విచిత్ర వేషధారణ, కోయ నృత్యాలు తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. అమ్మవారు చల్లగరగ రూపంలో ద్వారా ఇంటింటికీ దర్శనమిచ్చారు.

దేవాలయాల మధ్యలో మద్యం షాపు తొలగించాలి

కొత్తపేట: స్థానిక బోడిపాలెం వంతెన సమీపంలో హిందూ దేవాలయాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం జిల్లా కేంద్రం అమలాపురంలో నిర్వహించిన బీజేపీ గ్రీవెన్స్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణకు మెమొరాండం సమర్పించినట్టు కనకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ షాపును గురించి గత 20 రోజుల క్రితం సంబంధిత ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని జిల్లా అధ్యక్షుని దృష్టికి తీసుకువెళ్లినట్టు పేర్కొన్నారు. దానిపై ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ షాపును అక్కడి నుంచి తొలగించకపోతే తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించినట్టు పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామం పిల్లివారిపేటకు చెందిన కార్యకర్త పిల్లి రామచంద్రరావు ఆకస్మికంగా మరణించగా, అతని కుమారుడు నరసింహారావును వైఎస్సార్‌సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, యన్నాబత్తుల ఆనంద్, కారుపల్లి శ్రీను, మంగం శ్రీను తదితరులు ఉన్నారు.

పందిరిరాట ముహూర్తం

రావులపాలెం: స్థానిక సీతారామచంద్రస్వామి, షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో వసంత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పందిరిరాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి జనార్ధన కేశవమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరరాట పాతారు. ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, మల్లిడి కోటేశ్వర రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు పాల్గొని పందిరిరాటను పాతారు. అనంతరం శ్రీరామనవమి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్తి రామకృష్ణారెడ్డి, గొలుగూరి వెంకటరెడ్డి, గొలుగూరి మునిరెడ్డి, నందం సత్యనారాయణ, పడాల వెంకటరెడ్డి కర్రి రెడ్డియ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కోఆర్డినేటర్



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, నాయకులు

అయినవిల్లి: వీరవల్లిపాలెం వేంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రథమ వార్సికోత్సవం, కల్యాణ మహోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, పార్టీ జిల్లా కార్యదర్శి మిండగుదిటి రాంబాబు, దామిశెట్టి బుజ్జి, మేడిశెట్టి రాజా తదితరులు ఉన్నారు.

బాధితులకు ఓఎన్జీసీ నిత్యావసరాల పంపిణీ

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో 20 మంది బాధిత కుటుంబాలకు ఓఎన్జీసీ నిత్యావసర సరకులను సోమవారం పంపిణీ చేసింది. ఈ మేరకు సంస్థ ఇన్సులేషన్ మేనేజర్ జగన్నాథరరావు, మరో అధికారి ఆరో నాయక్ వీటిని అందజేశారు. గ్రామ సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్టా అనంతలక్ష్మి, ఉపసర్పంచ్ ఎలుమర్తి బాబూజీ, కార్యదర్శి బత్తుల రమణ, వీఆర్వో వీర్రాజు, స్థానికులు ఎం.యేసురత్నం, నల్లి దాసు, జి.నాగేశ్వరరావు, యు.ప్రసాద్, ఏఎన్ఎం రాధ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర



అంబాజీపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాల మహానాడు నాయకులు

అంబాజీపేట: కులగణన జరగకుండా ఎస్సీ వర్గీకరణ చేయడం టీడీపీ రాజకీయ కుట్రేనని వర్గీకరణ నిలిపే వరకు ఆందోళన చేస్తామని పలువురు మండల మాల మహానాడు నాయకులు పేర్కొన్నారు. అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను కేబినేట్‌లో ఆమోదించడం టీడీపీ ప్రభుత్వానికి తగదన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ రాలీగా తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు వెళ్లి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జల్లి బాలరాజు, ముత్తాబత్తుల ప్రశాంత్, నెల్లి వెంకటరమణ, కుసుమ శ్రీను, గోసంగి కుమార స్వామి, మైలా ఆనందరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ శెట్టిబలిజలకు కేటాయించాలి



తాటిపాకలో సమావేశమైన సంఘ నాయకులు

రాజోలు: రాజోలు అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని శెట్టిబలిజ సామాజిక వర్గానికి కేటాయించాలని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాటిపాక సంఘ భవనం వద్ద సమావేశం జరిగింది. దశాబ్దాలుగా ఏఎంసీ చైర్మన్ పదవి ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా శెట్టిబలిజలకు కేటాయిస్తున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఎంసీ చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఏఎంసీ చైర్మన్ జనరల్‌కు కేటాయించినప్పుడు కూడా ఆ స్థానంలో శెట్టిబలిజలకు అవకాశం ఇచ్చారన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు దీనిపై పునరాలోచన చేయాలని, రాజోలు మార్కెట్ కమిటీ చైర్మన్ శెట్టిబలిజలకు కేటాయించాలని కోరారు. డీసీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గుబ్బల మనోహర్, గుబ్బల బాబ్జి, నాయకులు గుబ్బల శ్రీను, ఫణీంద్ర, కడలి సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రుణాల పంపిణీ

మలికిపురం: నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ మహిళల అభ్యున్నతికి సబ్సిడీపై రుణాలను సోమవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పంపిణీ చేశారు. విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన రుణాలు అందజేశారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, రాజోలు డీసీ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఎంపీటీసీలు మంగెన భూదేవి, ఆవుపాటి లలితా శివజ్యోతి, జక్కంపూడి శ్రీదేవి, నాయకులు సాయిబాబరాజు, మోకా పార్వతి, బందెల పద్మ, ఉలిశెట్టి అన్నపూర్ణ, చాగంటి స్వామి, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

కోకో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ నాగేశ్వరరావు

అంబాజీపేట: కోనసీమలో కొబ్బరి తరవాత అధిక మొత్తంలో సాగుచేస్తున్న కోకో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో కోకో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటారని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి వచ్చే అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. గౌరవ ప్రజాప్రతినిధులు, సర్పంచులు ఎంపీటీసీలు, అడిగిన ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు ఉండాలని లేకపోతే, ఉపేక్షించేది లేదని ఆయన అధికారులను హెచ్చరించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులకు సాగు నీటిని వంతుల వారీ విధానంలో అమలు పరుస్తున్నామని ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ అధికారి మాట్లాడుతూ గతం నుంచి ఎదురుచూస్తున్న గృహ నిర్మాణ రుణాలు మంజూరయ్యాయని, ఆ మొత్తాలను సంబంధిత లబ్ధిదారులకు వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. అయితే కొంతమంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ తమ పరిధిలో జరుగుతున్న పనులకు సరైన సమాచారాన్ని సంబంధిత అధికారులు చెప్పటం లేదని ఆరోపించారు. సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీఓ జీవీ సరోవర్, ఇన్‌చార్జి తహసీల్దార్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి



జొన్నాడలో ప్రసంగిస్తున్న ప్రసాద్

ఆలమూరు: ప్రజల ఆరోగ్యాన్ని అస్తవ్యస్తం చేసే సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కెవిడి ప్రసాద్ కోరారు. మండలంలోని జొన్నాడ తారకరామ కాలనీ వద్ద ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ కట్టా శ్రీనివాసు అధ్యక్షతన సోమవారం నవోదయం 2.0 కార్యక్రమం జరిగింది. ఈఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా అనేక చోట్ల వివిధ రకాల నిషేధ పదార్థాలను ఉపయోగించి సారా తయారు చేస్తున్నారని ఆవేదన చెందారు. దీనివల్ల సారాను తాగుతున్న నిరుపేదలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. జిల్లా పరిధిలో ఎక్కడైనా సారా తయారీ గాని అమ్మకాలు గాని చేస్తే సత్వరమే సమీప ఎక్సైజ్‌శాఖకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దే విధంగా పనిచేస్తున్న తమకు ప్రభుత్వ శాఖలన్ని సహకరించాలన్నారు. తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, ఎస్సై పి.రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్ పాల్గొన్నారు.

సొసైటీ అక్రమాలపై ఫిర్యాదు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో గతంలో జరిగిన అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు అందింది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆ గ్రామానికి చెందిన దంగేటి బాపనయ్య ఫిర్యాదు చేశారు. 2008లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ కూడా దుర్వినియోగం అయ్యిందని, అలాగే సొసైటీ అభివృద్ధికి మంజూరైన నిధులను కూడా స్వాహా చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



మామిడికుదురులో ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల అమ్మకాలు

మామిడికుదురు: వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు స్టాల్ ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయధికారిణి బి.మృదుల, ఈటీపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు స్టాల్‌ను పరిశీలించారు. ఎటువంటి రసాయనాలు, క్రిమి సంహారకాలు వాడకుండా పండించిన పంటల ఉత్పత్తులను వినియోగించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌టు కుడుపూడి జానకి, ఎల్‌త్రీ చెల్లుబోయిన రాధ, డీఎం నాగవరపు శ్రీనివాసరావు, ఎంటీ గోగి లెనిన్‌బాబు పాల్గొన్నారు.

ఖురాన్ అవతరణ దినోత్సవం



మామిడికుదురులో ఖురాన్‌ను శిరస్సుపై పెట్టుకుని ప్రార్థన చేస్తున్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల పవిత్ర గ్రంథం 'ఖురాన్' అవతరణ దినోత్సవాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 'షబే ఖదర్'గా వ్యవహరించే ఈ కార్యక్రమం ఆద్యంతం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా మసీదులను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. షబే ఖదర్‌లో భాగంగా ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం ఉదయం 'సహరి' వరకు నమాజులు, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సామూహిక ఖురాన్ పఠనంతో పాటు ప్రత్యేక మజ్లిస్‌లు నిర్వహించారు. ఖురాన్ గ్రంథాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రార్థనలు చేశారు. మామిడికుదురు నస్రుమినల్లా షియా మసీదులో మత ప్రబోధకులు షబ్బర్ అలీజైదీ, మెహదీ హసన్ బెహిష్తీ, మహ్మద్ ఇబ్రహీమ్ ఖురాన్ అవతరణ రాత్రి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. ఖురాన్ సూక్తులను పఠిస్తూ జాగరణ చేశారు. అల్లా హు అక్బర్ అంటూ ముస్లింలు నినదించారు. కార్యక్రమాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

మామిడికుదురు: రంజాన్ మాసం సందర్భంగా నగరం గ్రామంలో ముస్లిం ప్రముఖుడు రజ్వీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందని ఆయన అన్నారు. రంజాన్ దీక్షల్లో పాల్గొని ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

బీరువాల బహూకరణ

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం బీరువాల బహూకరణ జరిగింది. స్థానిక పాఠశాలలో చదువుకున్న 1994–95 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుమారు రూ.25 వేల విలువైన ఈ బీరువాలను ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఈ బీరువాలతో పాఠశాల రికార్డులను భద్రంగా ఉంచాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు పి.సత్యనారాయణ, వాకా గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయను తరిమేద్దాం



తాటిపాక సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన పీహెచ్‌సీ సిబ్బంది

ఆలమూరు: నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ సమష్టిగా కృషి చేసి దేశం నుంచి తరిమి కొట్టాలని కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని ఆలమూరు సీహెచ్‌సీ, చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు పి.గోపిరామ్, శ్రీకాంత్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. క్షయ నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలను, రోగులకు అందించాల్సిన చికిత్స విధానాన్ని స్థానిక రోగులకు సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు బి.సూర్యనారాయణ, ఏవీవీ రాజా వివరించారు. అనంతరం ఆయా పీహెచ్‌సీలకు చెందిన వైద్యారోగ్య, ఆశ సిబ్బంది క్షయ వ్యాధి నివారణ ఆవశ్యతను వివరిస్తూ గ్రామ విధుల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్ బాలామణి పాల్గొన్నారు.

వీరవల్లిపాలెంలో..

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు పి.విజయ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బందితో మానవహారం ఏర్పాటు చేశారు. క్షయ వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విజయ్ మాట్లాడుతూ రెండు వారాల మించి దగ్గు, జ్వరం, కళ్లెలో రక్తం పడటం, బరువు తగ్గడం, రాత్రి పూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని ప్రభుత్వం నెలకు రూ.500 చొప్పున 6 నెలల పాటు ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్ బాబు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్స్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉంటే క్షయవ్యాధి నిర్మూలించవచ్చని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) వైద్యాధికారి గన్నవరపు దుర్గాప్రసాద్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా సీహెచ్ ఐసీటీసీ, అవిడి పీహెచ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు జి.దుర్గాప్రసాద్, ఎం.వీరబాబు, ఎస్.శ్రీదివ్య, ఎ.మోహన్, అవిడి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.వెంకట్, ఐసీటీసీ కౌన్సిలర్ మెల్లం దుర్గాప్రసాద్, పీహెచ్ఎన్ సుగుణ పాల్గొన్నారు.

నగరంలో..

మామిడికుదురు: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ పీహెచ్‌సీ ఉద్యోగులు నినాదాలు చేశారు. క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.స్వర్ణలత సూచించారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గర్లోని ప్రభుత్వాస్పత్రులను సంప్రదించాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగుల్లంకలో..

పి.గన్నవరం: నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి వైవీ ప్రియాంక ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, ఎంపీహెచ్ఎస్ బీవీవీ ఎస్ఎన్ మూర్తి, కేసీహెచ్ మరియమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

తాటిపాకలో..

రాజోలు: క్షయ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారులు ఫణికిరణ్, దివ్య దర్శి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి తాటిపాక సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. తాటిపాక సెంటర్‌లో టీబీ నివారణ కోరుతూ పీహెచ్‌సీ సిబ్బంది మానవహారం నిర్వహించారు. సీహెచ్ఓ ఎం.ఎలిజెబిత్, పీహెచ్ఎన్ ఎ.సత్యవతి, సూపర్‌వైజర్లు మద్దాల శ్రీనివాస్, ఎంపీహెచ్ఈఓ త్రినాథ్, ఫార్మసిస్ట్ సుబ్రహ్మణ్యం, ఎల్‌టీ ఎ.త్రినాథ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



చొప్పెల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



కొత్తపేటలో క్షయ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ ఉద్యోగులు



వీరవల్లిపాలెంలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది